# అదికాదు మా సంస్కృతి

ఆమె లేత గులాబీ రంగు ఫ్రాక్ వేసుకుంది. ఫ్రాక్ మోకాళ్ళకు కాస్త పైకే ఉంది. ఫ్రాక్ ఆమె శరీరాన్నంటిపెట్టుకుని ఉండడంవల్ల నడుము నుంచి భుజాల వరకూ ఆమె వంటి సొంపులు చూస్తూనే అంచనా వేయవచ్చు.

నేనామెను కన్నార్పకుండా చూస్తున్నాను.

ఆమె పేరు బెట్టీ. అమెరికా నుంచి ఇప్పుడే ప్లేన్లో దిగింది. నేనామెను రిసీవ్ చేసుకునేందుకు వచ్చాను. ఆమెను చూసీచూడగానే నాకనిపించిన మొదటి విషయం - ఈ రోజు శ్రీవారూళ్ళో లేకపోవడం నా అదృష్టమని! ఈ విధంగా డ్రస్ చేసుకునే ఆడవారిపై శ్రీవారికి సదభిప్రాయం లేదు. సదభిప్రాయం లేదని అసహ్యించుకోరు. ఆయన ప్రవర్తన అదుపు తప్పుతుంది. అలా అదుపు తప్పడం తప్పు కాదని నాతో వాదిస్తారు. ఎన్నోసార్లు స్లీవ్‌లెస్ వేసుకున్న యువతుల భుజాలు రాసుకుంటూ వెళ్ళారాయన. ఆయన పక్కన నేను తనకు శ్రీరామరక్ష.

"సో..యూ ఆర్ రాధ!" అన్నదామె. వెంటనే "యూ ఆర్ రియల్లీ మార్వలెస్.." అని నన్నభినందించింది.

అంత వెనువెంటనే నేనామెనభినందించలేకపోయాను. ఆమె పొగడ్త కలిగించిన సిగ్గు నించి తేరుకుందుకే కొంత సేపు పట్టింది.

నేను బెట్టీని మా యింటికి తీసుకుని వెళ్ళాను. ఆమె మా యింట్లో అడుగు పెట్టడం చుట్టుపక్కల వాళ్ళందరూ వీధుల్లోకి వచ్చి మరీ విచిత్రంగా చూశారు. లోపలకు వెళ్ళేక బెట్టి నన్నడిగింది వాళ్ళంతా అలా ఎందుకు చూశారని!

"ఇక్కడి స్త్రీలు ఏ మాత్రమూ వళ్ళు కనబడనివ్వరు. అది తప్పుగా భావిస్తారు.." అన్నాను..

బెట్టీ అప్పటికేమీ మాట్లాడలేదు. ఆమె మా యింటిని 'సుపర్బ్' అంది. డ్రాయింగ్ రూం చూసి నా అభిరుచి అద్భుతమంది. బెడ్‌రూం చూసి.."యూ హావ్ టేస్ట్!" అని మెచ్చుకుంది.

బెట్టీ అమెరికాలో స్థిరపడిన జర్మన్ వనిత. ఆమె నా కలం స్నేహితురాలు. ఇద్దరం ఉత్తరాల ద్వారా ఎన్నో సాంఘిక సమస్యలను లోతుగా చర్చిస్తూంటాం. అమెరికా విశేషాలు - ఒక అమెరికన్ ద్వారా తెలుసుకొనడం వల్ల - నాకాదేశ మంటే ఎంతో గౌరవభావమేర్పడి మన దేశం ఆ స్థాయికి ఎప్పుడెదుగుతుందా అని కలలు కంటూంటాను. మన దేశంలోని సాంఘిక సమస్యల గురించి నా ఉత్తరాల ద్వారా తెలుసుకున్నాక - కొంతకాలం లోతుగా ఆలోచించి బెట్టీ నాకు వ్రాసిన తన అభిప్రాయమిది:

"నీ ఉత్తరాలను బట్టి నాకు తేలినదేమిటంటే..మీ దేశంలో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యముంటే ఆమె పురుషుడికి బానిసగా పడి ఉండదు. ఏ దేశంలో స్త్రీ పురుషుడికి బానిసగా పడి ఉంటుందో ఆ దేశం ప్రగతిని సాధించలేదు.."

ఇది నాకు నిజమేననిపించింది.

నేను బియ్యే ప్యాసయ్యాను. ఉద్యోగం చెయ్యడానికి శ్రీవారు ఒప్పుకోలేదు. ఇంట్లో ఎంత చిన్న ఖర్చుకైనా శ్రీవారి అనుమతి కావాలి నాకు. ఆయన చేసే ప్రతీ ఖర్చూ నా ఆనందానికి కాక - నేను తనను ఆనందంగా ఉంచడానికే అవుతుంది. నా అభిరుచులకాయన విలువనివ్వరు. ఆయన అభిరుచులకు నేను తల వంచాలి. నా ప్రవర్తననాయన తీర్చి దిద్దుతారు. ఆయన ప్రవర్తనను మార్చుకోరు సరిగదా సమర్థించుకుంటారు. మా దాంపత్యం రెండు వ్యక్తిత్వాల కలయిక కాదు. ఆయన వ్యక్తిత్వపు నీడలో నేను జీవిస్తున్నాను.

ఇదే అమెరికాలో అయితే నేనాయనకు విడాకులిచ్చి నా అభిరుచులకు తగిన మరో వ్యక్తిని వివాహం చేసుకుని ఉండేదాన్ని. ఇక్కడ విడాకులు అన్న పదం నా హక్కు కాదు. ఆయన నన్ను బెదిరించడానికి వాడే ఆయుధం!

బెట్టీ వ్రాసిన ఉత్తరాన్ని మా అత్తగారికి చూపించాను.

మా అత్తగారి పేరు మహాలక్ష్మి. ఆమెకు తెలుగు మాత్రమే కాక హిందీ, ఆంగ్ల భాషలు కూడా క్షుణ్ణంగా వచ్చును. ఆమెకు ముగ్గురు మగపిల్లలు, ఇద్దరాడపిల్లలు. మగపిల్లల్లో మా వారే ఆఖరు. పిల్లలందరూ కూడా మంచి పొజిషన్లో ఉన్నారు. మా అత్తగారి మకాం మాత్రం పల్లెటూళ్ళోనే! అక్కడ వారికి అయిదెకరాల పొలముంది. లంకంత కొంప ఉంది. పాడి పశువులు ఉన్నాయి.

మామయ్య పల్లె వదిలి రారు. అందుకని అత్తగారూ రారు. ఇంటి వద్ద అన్ని పనులూ చూసుకుంటూ అమె అన్ని భాషల సాహిత్యాన్నీ చదువుతూంటారు.

అత్తగారా ఉత్తరం చదివి.."ఆ అమ్మాయెప్పుడైనా ఇండియా వస్తే నా దగ్గరకు తీసుకునిరా! మన పద్ధతుల్లోని గొప్పతనాన్ని వివరించి చెప్పి పంపిస్తాను..." అన్నారు.

ఈ విషయం నేను బెట్టీకి రాశాను. ఆ తర్వాత ఆర్నెల్లకే ఆమె ఇండియా వచ్చింది.

ఆ రోజు బెట్టీ కోసం నేను కేక్ తెప్పించాను. కానీ ఆమె భారతీయ వంటకాలనే తింటానని పట్టుబట్టింది. కారం లేకుండానూ పులుపును బాగా తగ్గించీ వంటలు చేశాను. ఆమెకు నా వంటలు విపరీతంగా నచ్చాయి. "హెవెన్లీ టేస్ట్"అని మెచ్చుకుందామె.

"భోజనాలయ్యాక ఇద్దరం కబుర్లలో పడ్డాం. అప్పుడు బెట్టీ మళ్ళీ వేష ధారణ ప్రసక్తి

తెచ్చి - "మా దేశంలో మగాళ్ళ కంటే ఆడవాళ్ళే శరీరాన్నెక్కువ ప్రదర్శించే బట్టలు వేసుకుంటారు. ఎందుకంటే ఆడదాని శరీరం అందమైనది. ప్రదర్శన యోగ్యమైనది..." అంది.

"కానీ అప్పుడు మగవాళ్ళు అల్లరి పెట్టరూ?"

"అల్లరి పెడితే అది సంస్కారమనిపించుకోదు. మీ దేశంలోని మగవాళ్ళంత సంస్కార విహీనులా?" అంది బెట్టీ.

నా భర్త సంస్కారం గురించి నాకు తెలుసు. ఆయన సాయంత్రం వచ్చేస్తారు. రాగానే బెట్టీని చూస్తే!

ఏమో... బెట్టీ సంస్కారం ఎటువంటిదో? ఆమెకైతే..ఇష్టపడిన మగాడితో శరీరాన్ని పంచుకొనడం తప్పు కాదు, ముందామె వేషధారణను మార్చాలి.

నేనామెకప్పుడు చీర గురించి గొప్పగా చెప్పాను. చీర ఆడదాని శరీర సౌందర్యాన్ని రమణీయంగా ప్రదర్శించ గలదని అన్నాను. నా మాటలు బెట్టీపై ప్రభావం చూపించాయి. ఆమె చీర కట్టుకుంటానంది.

లేత నీలపు రంగు చీరనామె ఎన్నుకుంది. దానికి మాచింగ్ లంగా, బ్లవుజు కూడా ఇచ్చాను. ముందామె లంగా బ్లవుజు వేసుకుని. "ఈ డ్రస్సు చాలా బాగుంది.." అని మెచ్చుకుంది.అప్పుడు నేను చీర కట్టుకోమని హెచ్చరిస్తే.. "ఇంకా వీటి మీద వేరే చీర ఎందుకు? ఇలాగే చాలా బాగుంది.." అంది. ఆమెకు నచ్చచెప్పడానికి నాకు చాలాసేపు పట్టింది. చివరికామె చీర కట్టుకుంది. నేనామెకు కుచ్చిళ్ళు, పైట ఎన్నో సార్లు సవరించవలసి వచ్చింది.

"ఇటీజ్ వండర్‌ఫుల్!" అంది బెట్టీ.

నిజంగానే బెట్టీ ఆ డ్రస్సులో దేవకన్యలా ఉంది. సాయంత్రం శ్రీవారామెనలాగే చూశారు. అప్పుడే ఆయన ఊర్నించి వచ్చారు.

నేనూహించినట్లు శ్రీవారామెను ఆకలి చూపులు చూడలేదు. ఆమెతో ఎంతో మర్యాదగా మాట్లాడి ఒక అతిథిని గౌరవించాల్సిన విధంగా గౌరవించారు.

బెట్టీ మాతోపాటు రెండ్రోజులుంది. ఒకరోజు శ్రీవారు ఆఫీసుకు సెలవుపెట్టి ఓ టాక్సీ మాట్లాడి ఊళ్ళోనూ, చుట్టుపక్కలా చూడతగ్గ విశేషాలు చూపించారు. బెట్టీ అన్నీ పసిపాపలా చూసి ఆనందించింది. నా జీవితాన్ని మెచ్చుకుంది.

శ్రీవారు బెట్టీతో అవధులు దాటకపోవడమూ, నా స్నేహితురాలిగా ఆమెకు విలువ నివ్వడమూ గమనించేక ఆయన్ను నేను సరిగా అర్థం చేసుకోలేదా అనిపించింది.

రెండురోజులైనాక బెట్టీ మా అత్తగారిని కలుసుకుందుకు ఆత్ర పడింది. అత్తగారుండే పల్లెటూరికి బస్సులో రెండు గంటల ప్రయాణం. శ్రీవారు మమ్మల్నిద్దర్నీ వెళ్ళిరమ్మన్నారు.

బెట్టీ, నేనూ మా అత్తగారింటికి బస్సులోనే వెళ్లాం.

బెట్టీ ఒక రోజంతా పల్లెటూరి జీవితం చూసింది. కొబ్బరి బొండాలు, తేగలు, ముంజికాయలు, కాల్చిన శనగలు.. ఆమెకు అమితానందం కలిగిస్తే అక్కడి అపరిశుభ్రత

ఆమెకు అసహ్యాన్ని కలిగించింది.

ఆ రాత్రి అత్తగారు, బెట్టీ దొడ్లో ఆరుబయట మంచాలం మీద కూర్చున్నాక - "మీ దేశంలో సహజ సంపదలకు లోటు లేదు. కానీ స్త్రీకి విలువివ్వకపోవడం వల్ల సమాజం ముందడుగు వేయడంలేదు.." అంటూ బెట్టీ వాదన ప్రారంభించింది.

"అగ్ర దేశాలకంటే ముందు మా దేశం స్త్రీని ప్రధానిగా ఎన్నుకుంది. ఈ విషయం నీకు తెలియదా!" అన్నారు అత్తగారు.

"నేను ప్రధాని ఎవరూ అని చూడ్డం లేదు. సమాజంలో స్త్రీ ఎలా జీవిస్తోందీ అని చూస్తున్నాను..." అంది బెట్టీ.

"అదే నేనూ చెబుతున్నాను. అర్హతలున్న స్త్రీ నాయకత్వాన్ని మా దేశం ఆమోదించింది. ఇంక సమాజం విషయమంటావా నేను చెప్పేది శ్రద్ధగా విను..." అన్నారు అత్తగారు.

"ఈ సృష్టిలో స్త్రీ పురుషులకు విడివిడిగా ప్రత్యేకమైన పాత్రలున్నా యి. పురుషుడిది శక్తి, స్త్రీది అనురక్తి. ఈ పాత్రలను సరిగా అర్థం చేసుకోవడం వల్ల ఏర్పడినదే హిందూ సంప్రదాయం. స్త్రీ తన అనురక్తితో భావితరాలను తీర్చిదిద్దగలదు. పురుషుణ్ణి మరింత శక్తిమంతుణ్ణి చేయగలదు. హిందూ సమాజంలో స్త్రీకి రక్షణ ఉంది. విలువ ఉంది. మాతృత్వానికి సార్థకత ఉంది".

"మా దేశంలో మాతృత్వానికి సార్థకత లేదా?" అంది బెట్టీ.

"ఎలా ఉంటుంది? తల్లిగా తను లాలిస్తూ తండ్రికి బిడ్డను చేరిక చేయడంలోనే మాతృత్వానికి సార్థకత ఉంది. చీటికీ మాటికీ విడాకులో అని ఘోషించే మీ దేశ దంపతులొక్కరుగా తమ బిడ్డల్నాదరించగల అవకాశాలేవీ?"

"అంటే, ఎదిగే బిడ్డ సౌఖ్యం కోసం స్త్రీ తన సుఖాన్ని త్యాగం చేయాలా? ఇష్టంలేని మనిషితో జీవించాలా?"

మా అత్తగారు నవ్వి. "మీకు స్వతంత్రం అర్థం తెలియదు. మీ దేశంలో శీలం అన్న పదానికి అర్థమే వేరు. పెళ్ళికి ముందు పవిత్రంగా ఉండాలన్న కట్టు ఆడదానికి లేదు. అలాంటప్పుడు అన్ని విధాలా పురుషుణ్ణి అవగాహన చేసుకున్నాకనే వివాహం చేసుకొనవచ్చునుకదా? అయినా మీకు విడాకుల అవసరమెందుకేర్పడుతోంది? అదైనా ఒకసారితో ఆగుతోందా? పురుషుడి ప్రవృత్తి వేరు. స్త్రీ ప్రవృత్తి వేరు. ఏ పురుషుడూ స్త్రీ కోరిన ఆదర్శ భర్త కాలేడు. ఈ పరమసత్యం గ్రహిస్తే స్త్రీ విడాకులకు బదులు సహనాన్నీ, సహజీవనాన్నీ, తన బిడ్డల సౌఖ్యం కోసం త్యాగాన్నీ ఆశ్రయిస్తుంది. అందుకే మా దేశంలో అపరిచితుల మధ్య జరిగినా వివాహాలు నూరేళ్ళు బ్రతుకుతున్నాయి..." అన్నారు.

"మాకు స్వతంత్రం అర్థం తెలియదని ఎందుకనుకుంటున్నారు? మీ వివాహాలు నూరేళ్ళు బ్రతకడానికి కారణం ఈ దేశంలోని ఆడవాళ్ళ బానిస మనస్తత్వమని ఎందుకనుకోరు?' అంది బెట్టీ.

"మాది బానిసత్వమనుకుంటే అది మీ భ్రమ! మిమ్మల్ని గుడ్డిగా అనుసరిం

చాలనుకునే కొందరు మా ఆధునికుల భ్రమ!''

అత్తగారింత కచ్చితంగా చెబుతారని నేననుకోలేదు. అయితే బెట్టీ దీనికి కోపగించుకోకుండా..''శీలానికి ప్రాముఖ్యత లేకుండా, తన అవసరాలకు తను సంపాదించుకుంటూ, ఇష్టంలేని పురుషుడి నవలీలగా వదిలేస్తూ, 'ఏ దేశంలో స్త్రీ మనగల్గుతుందో అక్కడ పేదవారికి కూడా స్వంత కారుంటుంది. సకల సదుపాయాలూ ఉంటాయి. కనీసం ఈ విషయానైనా వెనుకబడివున్న మీ దేశస్థులు ఒప్పుకోవాలి...'' అంది.

''పద - నువ్వడిగిన ప్రశ్నకు సమాధానం చూపిస్తాను'' అన్నారు అత్తగారు బెట్టీతో.

ఇద్దరం ఆమె ననుసరించి పెరట్లో నూతి గట్టు వద్దకు వెళ్ళాం. అక్కడ మా పనిమనిషి చెల్లమ్మ అంటగిన్నెలు తోముతోంది. ఆ దృశ్యం చూసి బెట్టీ ఇబ్బందిగా ముఖం పెట్టింది. అలాంటి దృశ్యం ఆమె అంతకు ముందెన్నడూ చూసినట్లులేదు.

అత్తగారు బట్టీతో..''ఈమె తన అవసరాలకు తనే సంపాదించుకుంటోంది. భర్త తిన్ననైనవాడు కాదని వదిలేసి ఇంకొకణ్ణి కట్టుకుంది. ఇప్పుడున్న వాణ్ణి వదిలేద్దామని ఆలోచిస్తోంది. విడాకుల గురించి ఆమె కోర్టుకు కూడా వెళ్ళదు. శీలం గురించి పెళ్ళి కాదన్న భయమామెకు లేదు. కానీ ఈమె ఉండేది.. నీ ఊహకు అందనంతం అసహ్యంగా ఉండే గుడిసెలో...'' అని చెప్పారు.

''అయితే?'' అంది బెట్టీ ఆశ్చర్యంగా.

''ఏ లక్షణాలు లోపించి మేము వెనుకబడుతున్నామో నువ్వు చెప్పావు. నువ్వు చెప్పిన లక్షణాలు గల వాళ్ళు మా దేశంలో ఈ చెల్లమ్మలాగే చాలామంది ఉన్నారు. వాళ్ళని మేము వెనుకబడిన వాళ్ళని అంటాము..'' అన్నారు, అత్తగారు.

నేను తెల్లబోయాను.

బెట్టీకి నోట మాట రాలేదు.

ఆధునికత పేరిట విదేశాలతో కొనసాగుతున్న స్త్రీ స్వాతంత్ర్యం మన దేశంలో వెనుకబడిన వర్గాలలో ఉంది. అయితే ఆ వర్గాలు వెనుక బడి ఉండడానికి కారణమేమిటి?

''నేను చెల్లమ్మను రోజూ చూస్తూంటాను. అందువల్ల నీ జీవిత విధానం విని నువ్వు వెనుకబడి ఉన్నావనే అనుకోవాలి లేదా వెనుక బడడానికి జీవిత విధానాలు కాక మరేదో కారణముంటుందని నువ్వూ నేనూ కూడా ఒప్పుకోవాలి...'' అని..''నీకు నా వయసు వచ్చేక నా అంత స్వతంత్రంగా, సంతోషంగా, గౌరవంగా, నీ దేశంలో నువ్వుండగలిగితే అప్పుడు నేను నీ సంప్రదాయాన్ని గొప్పదిగా అంగీకరిస్తాను. కానీ అంత వరకూ నేనుండను కదా! అందువల్ల నేను బ్రతికుండగా నువ్వు నా మనసును మార్చలేవు. అవునా?'' అన్నారు అత్తగారు.

ఆధునిక ప్రపంచంలో జీవిస్తూ - ఇంత లోతుగా నేనెప్పుడూ ఆలో చించలేదు. దీనికి బెట్టీ ఏమంటుందోనని కుతూహలంగా ఆమె వంక చూశాను.

బెట్టీ చటుక్కున వంగి మన సంప్రదాయం ప్రకారం అత్తగారికి నమస్కరించింది. ★

*(జ్యోతి మాసపత్రిక - జనవరి 1988).*